భూమాతను తీసుకొస్తున్నాం: మంత్రి


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ధరణి స్థానంలో భూమాతను తీసుకు రావాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిలో అనేక అక్రమాలు జరిగాయని, వీటిని దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంతవరకు సమస్యలు పరిష్కరించేందుకు పనిచేస్తున్నామన్నారు.

◆ నల్గొండ తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. నల్గొండ పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు వేరు వేరుగా తహసీల్దారు కార్యాలయాలు ఏర్పాటు అవసరమని, ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డిని ఆదేశించారు. నల్గొండ తహసీల్దారు కార్యాలయం ఆధునికీకరణకు రూ.25 లక్షలు కేటాయించామన్నారు.

◆ జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం బాగుందన్నారు. రాష్ట్రంలోనే నల్గొండ జిల్లా ధరణి దరఖాస్తుల పరిష్కారంలో ముందుందన్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి నల్గొండ జిల్లాలో 27 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా కలెక్టర్ చొరవతో వాటిని పరిష్కరించి ఆ సంఖ్యను 4 వేలకు తీసుకొచ్చామన్నారు. పేదవారికి ఇబ్బంది కలిగిస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

◆ ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీదేవి, నల్గొండ తహసీల్దార్ శ్రీనివాస్, పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

26న నల్గొండలో ఉద్యోగ మేళా

నల్గొండ విద్యావిభాగం: నిరుద్యోగ యువతీ యువకులకు పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 26న ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ ఫిట్టర్, టర్నర్, డిగ్రీ, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీజీ చదివి 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

సామాజిక తనిఖీలో బయటపడ్డ అక్రమాలు

మాడ్గులపల్లి: ఉపాధిహామీలో జరిగే చిన్నచిన్న లోపాలను సరిదిద్దేందుకే సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏపీడీ నర్సింహారావు తెలిపారు. మాడ్గులపల్లి మండలంలోని 28 గ్రామాలకు సంబంధించి మూడో విడత సామాజిక తనిఖీలో భాగంగా మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. అందరు కలిసి పనిచేస్తేనే పథకం ముందుకెళ్తుందన్నారు. సుమారు 600 అభ్యంతరాలను గుర్తించామన్నారు. కొన్ని గ్రామాల్లో పనికి వెళ్లకున్నా.. వారి స్థానంలో కుటుంబ సభ్యులు చేసినట్లు డబ్బులు చెల్లించారన్నారు. మస్టర్ నిర్వహణ, ఇతర రికార్డులను సక్రమంగా రాయలేదన్నారు. ఆదివారాల్లోనూ పనిచేసినట్లు చూపించి చెల్లింపులు చేశారన్నారు. రైతులు మొక్కలు నాటినట్లు రికార్డుల్లో ఉన్నా.. క్షేత్రస్థాయిలో పరిశీలించగా.. అక్కడ పంటలు సాగుచేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనిలో తప్పిదాలకు క్షేత్రసహాయకులు రూ. 8,300, టెక్నికల్ అసిస్టెంట్లు రూ. 29,238, పంచాయతీ కార్యదర్శులు రూ. 10,885, కూలీల నుంచి రూ. 995 రికవరీ, మరో టీఏకు రూ. వెయ్యి జరిమానా వేసినట్లు తెలిపారు. జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్‌రావు, ఏవీవో గౌతమి, అంబుడ్స్ మెన్ గౌరి, తదితరులు పాల్గొన్నారు.


తనిఖీ బృందం, టెక్నికల్ అసిస్టెంట్ల మధ్య వాగ్వాదం

షెడ్యూల్ వచ్చేసింది!

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే




వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి పూర్తి కానుండడంతో.. తదుపరి ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూలు విడుదల చేసింది. ఈ నెల 30 నుంచి ఓటు నమోదుకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఫారం-19 ద్వారా ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీనికి సంబంధించి అక్టోబరు 16, 25 తేదీల్లో ఎన్నికల అధికారులు ప్రకటనలు జారీ చేయనున్నారు. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని ఎన్నికల సంఘం సూచించింది.

ఇదీ షెడ్యూల్..

వరంగల్- ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు కార్యక్రమం ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుండగా.. నవంబరు 6 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. నవంబరు 23న ముసాయిదా జాబితా ప్రకటించి.. ఈ జాబితాపై అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 25 వరకు అభ్యంతరాలను పరిష్కరించి.. అదే నెల 30న ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నారు.



గత ఎన్నికల్లో 7,243 మంది ఓటర్లు..

గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 7,243 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 4,737 మంది, మహిళలు 2,505 మంది, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నారు.

★ నల్గొండ పట్టణంలో అత్యధికంగా 1,667 మంది ఓటర్లు ఉండగా.. రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత స్థానంలో సూర్యాపేటలో 880 మంది, మిర్యాలగూడలో 788 మంది, కోదాడలో 466 మంది, భువనగిరిలో 306 మంది, దేవరకొండలో 229 మంది, నకిరేకల్‌లో 217 మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

★ అన్ని మేనేజ్‌మెంట్ల ప్రభుత్వ పాఠశాలలు, అన్ని రకాల కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు సైతం ఓటు నమోదుకు అర్హులు.

ఉమ్మడి జిల్లాలో 2019లో ఉన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
నల్గొండ	30	2,488	1,370	1	3,859
సూర్యాపేట	22	1,467	689	0	2,156
యాదాద్రి	16	782	446	0	1,228

చివరికి నీరేదీ..!

గుర్రంపోడు, హాలియా, న్యూస్‌టుడే: ఏఎమ్మార్ ప్రాజెక్టు ప్రధానకాల్వ 111 కిలోమీటర్ల పొడవునా సాగునీటి పంపిణీకి నిర్దేశించిన 44 మేజరు కాల్వల చివరి భూములు గత రెండు దశాబ్దాలుగా సాగునీటికి నోచుకోవటం లేదు. నీరు రాకపోవటంతో అక్కడి కాల్వలు పూడిపోగా, కొన్ని రైతుల ఆక్రమణలో మాయమయ్యాయి.


డి-25 మేజరులో మారేపల్లి సమీపంలో నామమాత్రంగా కనిపిస్తున్న మేజరుకాల్వ

ప్రధానంగా అత్యధిక విస్తీర్ణంలో ఆయకట్టు ఉన్న డి-37, డి-25, డి-22, డి-19, డి-16, 17, డి-8, 9 తదితర డిస్ట్రిబ్యూటర్లలో చివరి భూముల రైతులు చాలాకాలంగా సాగునీటిపై ఆశలు వదులుకున్నారు. ఆనాడు తీసిన కాల్వలు మాత్రం అక్కడక్కడా కనిపిస్తున్నాయి. మేజర్లలో వదిలిన నీటిని మొదట ఉన్న రైతులే తమ పంటభూములకే కాక, చెరువులకు అధిక మొత్తం పరిమాణంలో మళ్లించుకోవటంతో దిగువరైతులకు మొండిచెయ్యి ఎదురవుతోంది. ఈ పరిస్థితిని అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించటంలేదు. టన్నెల్ పూర్తిచేయాలని గట్టి ప్రయత్నంలో ఉన్న ప్రభుత్వం ఈ ప్రాజెక్టు మేజర్లలో చివరి రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని పరిష్కరించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పోరాడినా ఫలితం సున్నా..

డి-22లో చివరి రైతులు గత ఏడాదికాలంగా సాగునీటికి పోరాడుతున్నా ఫలితం కనిపించటంలేదు. ఆక్రమణలకు గురైన కాల్వలను వెలికితీసి కాల్వలను కాపాడి దిగువకు నీటిని ఇవ్వాలని కొత్తలూరు రైతులు అధికారులకు ఏడాది క్రితం ఫిర్యాదు చేశారు. ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులకు రాజకీయనాయకులు అండగా ఉండటంతో అధికారులు మిన్నకుండి పోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల డి-22 కాల్వను రైతులు పూడికతీసి, ముళ్లపొదలను తొలగించి ముక్కాముల వరకు శుభ్రం చేసుకున్నారు. దీంతో ముక్కాముల చెరువు వరకు నీరు వస్తోంది. దిగువన ఉన్న కొత్తలూరు గ్రామానికి నీటిచుక్క రావటంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడి పది గ్రామాలలో సుమారు పదివేల ఎకరాల ఆయకట్టు రైతులు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

మాయమవుతున్న కాల్వలు


అనుముల మండలం నాన్ ఆయకట్టు ప్రాంతమైన మారేపల్లి, అన్నారం, ముక్కాముల, వెంకటాద్రిపాలెం, కొసలమర్రి గ్రామాలు, గుర్రంపోడు మండలం ఆములూరు, చేపూరు, బొల్లారం, నడికుడ, కొత్తలూరు, మొసంగి, అజలాపుర, తుర్కపల్లి గ్రామాలకు ఏఎమ్మార్పీ ప్రధానకాల్వ నుంచి డి-22, డి-25 ద్వారా చెరువులు నింపడానికి కాలువల్లో పెరిగిన ముళ్లకంచెలు ఆయకట్టురైతుల పరిస్థితికి అద్దం పడుతోంది. డి-19లో చివరి భూములున్న మొసంగి, కొత్తలూరు గ్రామాల మధ్య కాల్వలు పూర్తిగా పూడిపోయాయి. మరికొన్నిచోట్ల కాల్వలు మాయమయ్యాయి.

అధికారుల చుట్టూ తిరిగి అలిసిపోయాం:

బాసిరెడ్డి కృష్ణారెడ్డి, కొత్తలూరు

ఎగువన ఉన్న కొద్దిమంది రైతులు కాల్వలను ఆక్రమించటంతో దిగువకు నీళ్లు రావటమే ఆగిపోయాయి. కనీసం దిగువకు బాటలు లేకుండా చేశారు. ఈ విషయమై ప్రాజెక్టు సీఈ కార్యాలయంలో ఫిర్యాదు చేశాం. అయితే రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించాలి: కలెక్టర్


నల్గొండలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. నల్గొండలోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చదువు, భోజనం, అల్పాహారం, ఇతర సౌకర్యాల గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అల్పాహారం తక్కువ ఇస్తున్నారని, దోమల సమస్య ఉందని, దుప్పట్లు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు కావాలని కలెక్టర్‌ను కోరారు.

■ కలెక్టర్ స్పందిస్తూ భోజనం విషయంలో మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం వడ్డించాలని ఆదేశించారు. వారం రోజుల్లో మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలకు మరమ్మతులు చేయించాలన్నారు. డీఈవో భిక్షపతి, ఎంఈవో అరుంధతి పాల్గొన్నారు.

తొలగింపుల్లో జాగ్రత్తలు పాటించాలి.. నల్గొండ సంక్షేమం: ఓటర్ల జాబితా సవరణ ముందస్తు కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో ఓటర్ల చేర్పులు, తొలగింపులను పూర్తి జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. దూరదృశ్య శ్రవణ సమీక్ష అనంతరం ఆర్డీవోలతో సమీక్షించారు. ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని, చనిపోయినా, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు తొలగింపు, చేర్పులపై జాగ్రత్తగా చేయాలన్నారు.

కలెక్టర్ నారాయణరెడ్డికి కీలక బాధ్యత

నల్గొండ సంక్షేమం: నల్గొండ కలెక్టర్‌కు కీలక బాధ్యత దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఒకే రాష్ట్రం ఒకే కార్డు పేరుతో ప్రజలకు డిజిటల్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందు కోసం మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక, హరియాణాలలో అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. ఈ అధ్యయన బృందంలో నల్గొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి మహారాష్ట్రలో అధ్యయనం చేయనున్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు అధ్యయనం చేసి నివేదిక ప్రభుత్వానికి అందజేయనున్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

నల్గొండ విద్యావిభాగం: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పది, ఇంటర్ పరీక్షల ఫీజును తత్కాల్ కింద ఈ నెల 25, 26 తేదీల్లో అదనపు రుసుంతో చెల్లించవచ్చని డీఈవో బి.భిక్షపతి తెలిపారు. పదో తరగతికి రూ. 500, ఇంటర్మీడియట్‌కు రూ.1000 తత్కాల్ కింద అదనంగా చెల్లించాలని పేర్కొన్నారు. వెబ్‌సైట్ తెలంగాణ ఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ లేదా మీసేవా ద్వారా గాని ఫీజు చెల్లించాలని సూచించారు.

సన్నాల సందడి..!

హుజూర్‌నగర్, కోదాడ, న్యూస్‌టుడే:

ప్రభుత్వం సన్నరకాల కొనుగోళ్లకు సిద్ధమవుతోంది. త్వరలో తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి తోడు ప్రభుత్వం సన్నరకాల ధాన్యం పండించిన వారికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని గతంలోనే ప్రకటించింది. దీంతో రైతులు గతంలో కంటే సన్న రకాల ధాన్యం అధికంగా సాగు చేశారు.


★ ఉమ్మడి జిల్లాలో 5,59,497 ఎకరాలలో సన్నరకాలు సాగు చేయగా.. అందులో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పోటాపోటీగా జరిగింది. ఉమ్మడి జిల్లాలో సన్నరకాల ధాన్యం 13,43,756 మెట్రిక్ టన్నులు పండుతుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 4.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే అవకాశం ఉంది. పెరిగిన ప్రభుత్వ అవసరాల దృష్ట్యా ఇంకా ఎక్కువ కూడా కొనుగోలు చేసేందుకు అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.


హుజూర్‌నగర్: కోసిన తరువాత ఆరబెడుతున్న సన్నరకం ధాన్యం (పాత చిత్రం)


అంచనాలకు మించి..

వానాకాలం సీజన్‌లో పండే ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళిక ప్రకారం ప్రభుత్వం ముందుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 904 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 394 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 471 పీఏసీఎస్, మరో 45 ఇతర కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అంచనాలకు మించి కొనుగోళ్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు.


ఉమ్మడి జిల్లాలో సాగు వివరాలు (ఎకరాల్లో)



ధాన్యం దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)



కొనుగోళ్ల అంచనాలు (మెట్రిక్ టన్నుల్లో)



విద్యార్థులు సామాజిక సేవ అలవర్చుకోవాలి


ఎంజీయూలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ అల్వాల రవి, తదితరులు

నల్గొండ టౌన్: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ అలవర్చుకోవాలని ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. మంగళవారం ఎంజీయూలో నిర్వహించిన జాతీయ ఎస్ఎస్ఎస్ డే ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్‌లో చేరిన విద్యార్థులకు సమాజం పట్ల బాధ్యత పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ అపార అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ పి.మద్దిలేటి మాట్లాడుతూ ఎంజీయూ పరిధిలో 163 ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా 16,300 మంది విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములయ్యారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నల్గొండ ఇన్‌ఛార్జి ఆర్డీవోగా శ్రీదేవి



నల్గొండ గ్రామీణం: నల్గొండ ఇన్‌ఛార్జి ఆర్డీవోగా శ్రీదేవి బాధ్యతలు చేపట్టారు. ఈమె ఏఎంఆర్పీ ప్రత్యేక డిప్యూటి కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. నల్గొండ ఆర్డీవోగా ఉన్న రవి 30వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా మంగళవారం వర్షాలు కురిశాయి. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 9గంటల వరకు నమోదైన వర్షంలో అత్యధికంగా త్రిపురారం మండలం కామారెడ్డిగూడెంలో 125.3 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ తరువాత దామరచర్ల మండలం తిమ్మాపూర్‌లో 100 మి.మీ, శాలిగౌరారంలో 92 మి.మీ, అడవిదేవులపల్లి మండలం ముల్కచర్లలో 73.3మి.మీ వర్షపాతం నమోదైంది.

వరద పెరిగింది.. అలుగు పారింది

డిండి, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు దుందుభి వాగు ద్వారా డిండి జలాశయానికి స్వల్పంగా వరద పెరిగింది. మంగళవారం 8,360 క్యూసెక్కుల వరద వచ్చిచేరడంతో అదే మోతాదులో స్పిల్‌వే మత్తడి, ఎడమ, కుడి ప్రధాన తూముల ద్వారా దిగువకు ప్రవహిస్తోందని నీటిపారుదలశాఖ ఏఈ ఫయాజ్ తెలిపారు.


స్పిల్‌వేగుండా అలుగుపోస్తున్న డిండి జలాశయం

పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండండి


చందంపేట, న్యూస్‌టుడే: విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు డిండి వాగు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ ఏఈ ఫయాజ్ మంగళవారం తెలిపారు. డిండి ప్రాజెక్టు వరద, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరుతోడు కావడంతో డిండి వాగులో వరద ఉద్ధృతంగా కొనసాగుతుందని తెలిపారు. పరివాహక ప్రాంతాలైన మోత్యతండా, నక్కలగండి, బొల్లారం, దేవరచర్ల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. డిండి ప్రాజెక్టు నుంచి దిగువకు 8360 క్యూసెక్కుల నీరు రావడంతో ఆ ప్రాంత ప్రజలు, పశువులు, గొర్రెల కాపరులు అటు వైపు వెళ్లవద్దని ఏఈ సూచించారు.

ఎంఈవోలుగా ఎంఎస్‌వోలు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మండల విద్యాధికారుల నియామకంలో పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న మండల విద్యాధికారులు ఎఫ్ఏసీలుగా నాలుగు, అయిదు మండలాలకు ఉండటం వల్ల పర్యవేక్షణ లోపించింది. దీంతో మండల నోడల్ అధికారులుగా ఉన్న సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఆయా మండలాలకు మండల విద్యాధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నల్గొండ జిల్లాలో 33 మందికి ఎంఎన్‌వోలకు ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

అద్దె ఇల్లు పొమ్మంది..

సర్కారు భవనం దిక్కైంది


ఉమాపతి

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ బొడ్రాయి బజార్‌లో అద్దెఇంట్లో నివాసం ఉంటున్న గోగికార్ ఉమాపతి (60) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. మృతదేహాన్ని ఇంట్లో నుంచి తీసుకెళ్లాలని, ఇక్కడే ఉంచి అంత్యక్రియలు చేయవద్దని ఇంటి యజమాని తేల్చిచెప్పారు. చాలా కాలం నుంచి ఈ ఇక్కడే ఉంటున్నాం. .ఇప్పుడు శవంతో ఎక్కడికి వెళ్లాలని ఎంత వేడుకున్నా..యజమాని అంగీకరించక పోవడంతో..ఆ నిరుపేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఆవేదనకు గురైంది. దగ్గరి బంధువు జి.పరమేశ్ స్థానిక కౌన్సిలర్ గాజుల సుకన్య, నాయకుడు శ్రీనివాస్‌ను ఆశ్రయించారు. పాత తహసీల్ కార్యాలయ స్థలం వద్ద మహాత్మాగాంధీ విగ్రహం పక్కన నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పౌరసరఫరాల గోదాంలో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. ఉమాపతి మృతదేహాన్ని గోదాం ముందు టెంట్‌కిందకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కడచూపు కోసం వచ్చిన బంధువులు వర్షంలో తడుస్తూ అవస్థలు పడాల్సి వచ్చింది. ఉమాపతికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. వంట పనులు చేస్తూ జీవనం సాగించే ఆయన అనారోగ్యానికి గురై మృతిచెందారు.


నకిరేకల్: పాత తహసీల్ కార్యాలయ స్థలంలో ఉమాపతి మృతదేహం వద్ద బంధువులు

భావిపౌరులు... బలహీనమై..!

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: యాంత్రిక జీవన విధానంలో పడి తల్లిదండ్రులు పిల్లలకు సరైన పోషణ అందుతుందో, లేదో కూడా పట్టించుకోలేకపోతున్నారు. వెరసి చిన్నారుల వయసుకు తగ్గట్టుగా పోషకాలు అందడంలేదు. పట్టుమని 10 శాతం పిల్లలు కూడా పూర్తి పోషణతో ఉండడంలేదన్నది సర్వేలు చెబుతున్న వాస్తవం. ప్రధానంగా విటమిన్ ఎ, డి, ఐరన్ లోపంతో ఎక్కువగా బాధపడుతున్నారని కేంద్ర కుటుంబ, ఆరోగ్య మంత్రిత్వ శాఖ సర్వే నివేదిక పేర్కొంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరును 'పోషణ అభియాన్ మాసం'గా గుర్తించి అవగాహన కల్పిస్తుంది.

☛ అడవిదేవులపల్లి పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థి సాయంత్రం 4 గంటల తర్వాత కళ్లు తిరిగి కింద పడిపోయాడు. తల్లిదండ్రులు వైద్యం కోసం తీసుకెళితే..అబ్బాయి చాలా బలహీనంగా ఉన్నాడని.. రోజు పోషకాలతో కూడిన భోజనం అందించాలని సూచించారు.

☛ మిర్యాలగూడ పట్టణానికి చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలిద్దరూ రోజూ నీరసంగా ఉంటున్నారని వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. పిల్లలు రోజూ కాళ్లు, చేతులు లాగుతున్నాయంటున్నారని.. వారికి ఏదైనా టానిక్ రాసివ్వండని అడిగారు. ప్రస్తుతం ఇలాంటి ఘటనలు వైద్యుల వద్ద సాధారణమైపోయాయి.



అడవిదేవులపల్లిలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థినులు (పాత చిత్రం)

రోజూ భోజనంలో ఇవి తప్పనిసరి



పసుపు, నారింజరంగు కూరగాయలు, ఆకుకూరలు



గుడ్లు లేదా మాంసం



పాలు, రాగి జావ



తాజా పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, డ్రైఫ్రూట్స్

సరైన పోషణ అందకపోతే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా **3,209** ప్రభుత్వ పాఠశాలల్లో **2,11,009** మంది విద్యార్థులు చదువుతున్నారు.



మూడో వంతు **70,336** మంది చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నారు.

విటమిన్ లోపంతో **30000** మందిని కంటి సమస్యలు బాధిస్తున్నాయి.



రక్తహీనత కారణంగా నీరసం, తరచూ జ్వరంతో బాధపడుతూ చిగుళ్లవాపు, ఎముకల నొప్పుల వంటి సమస్యలు వేధిస్తున్నాయి. పాఠ్యాంశాలపై శ్రద్ధ చూపలేకపోతున్నారు.

వీరికి సరైన పోషకాలతో కూడిన ఆహారం అందించడం తల్లిదండ్రుల బాధ్యత.

వయసుల వారీగా పిల్లలకు కావాల్సిన పోషకాలు (గ్రాముల్లో)

వయసు	ప్రొటీన్లు	కొవ్వులు	కాల్షియం	ఐరన్(మి.గ్రా.)	క్యాలరీలు(శక్తి)
2-3	17.7	27	0.6	9	1,060
4-6	20.1	25	0.6	13	1,350
7-9	29.5	30	0.6	16	1,690
10-12	39.9	35	0.8	21	2,190
13-15	54.3	45	0.8	28	2,750

సమతుల ఆహారమందించాలి..: ఎస్‌డీ.అజహర్ అహ్మద్, ఎంవో, పీహెచ్‌సీ, అడవిదేవులపల్లి



పిల్లలకు ఇచ్చే ఆహారంలో కార్బోహైడ్రేట్లు 60 శాతం, పిండిపదార్థాలు 10 శాతం, కొవ్వు 30 శాతం పదార్థాలతో పాటు పీచు పదార్థాలు, విటమిన్లు ఉండే ఆకు కూరలతో కూడిన సమతుల ఆహారం ఇవ్వాలి. అరికెలు, సామలు, కొర్రలు, రాగులు వంటి చిరుధాన్యాలను అలవాటు చేయాలి.



ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న దృశ్యం

వేరుసెనగ వైపు అడుగులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: యాసంగిలో వేరుసెనగ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ సారి వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఆయకట్టేతర ప్రాంతాల్లో వరినాట్లు వేయలేకపోయారు. ఆగస్టు చివరి నుంచి కురిసిన వానలకు జల వనరులు కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. దీంతో మరో పది రోజుల్లో వేరుసెనగ సాగు పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. బీడు భూముల్లో చెత్తాచెదారం తొలగించి దుక్కులు దున్నుతున్నారు.

200 క్వింటాళ్ల విత్తనాలు విక్రయం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 200 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు విక్రయించారు. విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలు దొరకని రైతులు బయటి మార్కెట్‌లో సేకరించుకుంటున్నారు. ఎకరా సాగుకు సుమారు 80 నుంచి 85 కిలోల పల్లీవిత్తనాలు అవసరం. ప్రభుత్వం ఐదేళ్లుగా రాయితీ ఇవ్వకపోవడంతో రైతులకు విత్తన పెట్టుబడి భారంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో 13,500 ఎకరాల్లో..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో యాసంగిలో 13,500 ఎకరాల్లో వేరుసెనగ సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. నల్గొండ జిల్లాలో ఎక్కువగా దేవరకొండ, డిండి, మర్రిగూడ, గుర్రంపోడు, నల్గొండ, పెద్దవూర, పీఏపల్లి, చింతపల్లి, గుండ్లపల్లి మండలాల్లో ఎక్కువగా సాగవుతుందని భావిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో తిరుమలగిరి, ఆత్మకూర్(ఎస్), తుంగతుర్తి, మోతె, నాగారం, నూతనకల్ మండలాల్లో పల్లీలు పండించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎక్కువ మండలాల్లో వేరుసెనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పల్లీ సాగుకు అనుకూలం: శ్రవణ్‌కుమార్ జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

యాసంగిలో ఇప్పుడు వేరుసెనగ సాగుకు అనుకూలంగా ఉంది. వర్షాలు కురవడంతో భూముల్లో తడి ఉంది. సాగు పనులకు రైతులు సమాయత్తం కావచ్చు. నల్గొండ జిల్లాలో ఎక్కువగా దేవరకొండ డివిజన్‌లో పల్లీలు సాగు చేస్తారు.

జీవితానికి 'మరమ్మతులు' చేసుకొని..!



మిర్యాలగూడ సబ్ జైలు డిప్యూటీ జైలర్ విష్ణువర్ధన్‌రెడ్డి

తపన ఉండాలే కానీ ఏదైనా సాధించవచ్చని..వాటికెన్ని అడ్డంకులు ఎదురైనా పోరాటం చేయవచ్చని నిరూపించారు మిర్యాలగూడ సబ్‌జైలు డిప్యూటీ జైలర్ బుర్రి విష్ణువర్ధన్‌రెడ్డి. చదివేందుకు ఫీజులు చెల్లించే స్తోమత లేక ఇంటర్మీడియట్‌తోనే చదువు మానేసి.. పదేళ్లపాటు బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ.. దూరవిద్యలో మళ్లీ చదువును కొనసాగించి.. పోటీపరీక్షలు రాసి ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ జైలర్. తన ప్రయాణం గురించి ఆయన వివరించారు.. 'మాది మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని వేములపల్లి మండల కేంద్రం. అమ్మానాన్న జానకిరెడ్డి, అహల్య. ఇంటర్మీడియట్ వరకూ మిర్యాలగూడలోనే చదివి.. అనంతరం హైదరాబాద్‌లో ద్విచక్రవాహన మరమ్మతుల దుకాణంలో చేరా. మెకానిక్ పని చేసుకుంటూనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూర విద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశా. ఐసెట్‌లో సీటు సాధించి ఎంబీఏ 2013లో పూర్తి చేశాను. 2005 నుంచి 2015 వరకు బైక్ మెకానిక్‌గా పనిచేసినా.. స్నేహితుడి సాయంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. మొదటి ప్రయత్నంలో ఎస్సై పరీక్ష రాయగా ఎంపికవలేదు. ఆ తరువాత నిర్ణీత ప్రణాళికతో కష్టపడి పలు పోటీ పరీక్షలు రాయటంతో పంచాయతీ కార్యదర్శి పరీక్షలో 74వ ర్యాంకు, గ్రూప్-4లో 63వ ర్యాంకు, బిల్‌కలెక్టర్ ఉద్యోగం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించా. పంచాయతీ కార్యదర్శి ఉద్యోగంలో చేరి వేములపల్లి మండలం ఇసుకబాయిగూడెంలో 2019లో విధుల్లో చేరా. కొద్దిరోజులకే డిప్యూటీ జైలర్‌గా ఎంపికయ్యా. తమిళనాడులో శిక్షణ అనంతరం చంచల్‌గూడ, చర్లపల్లి కారాగారాల్లో విధులు నిర్వర్తించి ఇటీవల మిర్యాలగూడకు బదిలీపై వచ్చా. ప్రస్తుతం గ్రూప్-1 పరీక్షలకు సైతం సిద్ధమవుతున్నా.'..అని వివరించారు.

- మిర్యాలగూడ, న్యూస్‌టుడే

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు శివారులోని వెల్లటూరు కాలనీలో బ్రిక్స్ వ్యాపారి తమ్మిశెట్టి వెంకయ్య ఇంట్లో ఈ నెల 19వ తేదీ తెల్లవారుజామున దోపిడీకి పాల్పడిన దొంగల ముఠాలోని ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. నిందితుల నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ.38 వేల నగదు, నేరానికి వినియోగించిన కారుతోపాటు ఐదు చరవాణిలు, ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వేమవరపు నాగరాజు, వేమవరపు పుల్లారావు, భిక్షాలు, నల్గొండ జిల్లా వాసి రమావత్ మాత్రు, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చిక్కల ఆంజనేయులు, మేళ్లచెరువుకు చెందిన వేముల వెంకటేశ్వర్లు మొత్తం ఆరుగురు ఒక ముఠాగా ఏర్పడి ఈ నెల 19న వెల్లటూరులోని బ్రిక్స్ వ్యాపారి ఇంటి తలుపులు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించారు. కత్తులతో బెదిరించి వ్యాపారి వెంకయ్య, అతని ఇద్దరు కుమార్తెలను బెదిరించి వారి ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలతోపాటు రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఏడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. కోదాడ గ్రామీణ సీఐ రజితా రెడ్డి తన సిబ్బందితో అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు కారులో వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. విచారించడంతో వెల్లటూరుతో దోపిడీకి పాల్పడినట్లు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. వేముల వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నాడు. ఈ కేసులో కీలక సమాచారం అందించిన ఆటో డ్రైవర్ తిరుపతయ్యను ఎస్పీ సన్మానించారు. కేసు ఛేదనకు కృషిచేసిన అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రజితా రెడ్డి, మేళ్లచెరువు, అనంతగిరి, కోదాడ గ్రామీణ, చింతలపాలెం ఎస్సైలు పరమేశ్, నవీన్, అనిల్ రెడ్డి, సైదిరెడ్డి, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.



కీలక సమాచారం అందించిన ఆటో డ్రైవర్ తిరుపతయ్యను అభినందిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, చిత్రంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, తదితరులు

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



త్రిపురం సతీష్‌రెడ్డి

మఠంపల్లి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో యువ రైతు ప్రాణాలు కోల్పోయిన ఘటన మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో మంగళవారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపల్లికి చెందిన త్రిపురం సతీష్‌రెడ్డి(36) గత కొన్నేళ్లుగా ఇక్కడ వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేసుకుంటూ కుటుంబంతో ఉంటున్నారు. మధ్యాహ్నం వరకు గొర్రు దున్ని మోటారు వేసేందుకు వెళ్లిన సతీష్‌రెడ్డి స్టార్టర్ వద్ద సగానికి పైగా తెగి ఉన్న తీగను సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను చికిత్స కోసం హుజూర్‌నగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. స్వగ్రామంలో సొంత భూమి లేకపోవడంతో బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం ఈ గ్రామానికి వచ్చిన సతీష్‌రెడ్డికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామాంజనేయులు తెలిపారు.

భార్య చేతిలో భర్త హతం

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతో భర్తను భార్య హతమార్చిన ఘటన సూర్యాపేట మండలంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం హనుమానాయక్ తండాకు చెందిన ధరావత్ కౌసల్య కొంతకాలంగా మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త ధరావత్ సైదా(45) అడ్డు తొలగించుకోవాలని ఈ నెల 17వ తేదీ రాత్రి సమయంలో అతని కణతపై గొడ్డలితో గాయపరిచి హత్య చేసింది. మద్యం మత్తులో తూలి చెక్క బల్ల అంచుపై పడి తీవ్రంగా గాయపడి మృతిచెందినట్లు అందరినీ నమ్మించింది. ఈ హత్యను చిన్న కుమారుడు వినోద్ చూడగా అతడిని బతిమిలాడి బయటకు చెప్పకుండా జాగ్రత్త పడింది. మరుసటి రోజు మృతుడికి అంత్యక్రియలు పూర్తి చేశారు. చిన్నకుమారుడు వినోద్ తల్లితో గొడవపడి విషయాన్ని తన సోదరుడు సాయికుమార్‌కు చెప్పాడు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు గ్రామీణ ఎస్సై బాలు నాయక్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు మంగళవారం ధరావత్ కౌసల్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గ్రామీణ సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



సోమ బ్రహ్మాచారి

ఆయనో బ్రహ్మ..!

ఆయన ఉలి పడితే.. ఎంతటి నిర్జీవమైన వస్తువులైనా జీవం పోసుకుంటాయి.. చదువు పెద్దగా లేకపోయినా.. కొద్దిగా నైపుణ్యం.. చేసే పనిపై మనసు.. దానికి నిరంతర శ్రమ తోడైతే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు ముంజంపల్లి సోమబ్రహ్మాచారి.

★ చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామ పంచాయతీ వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఈయన.. ఆలయాలకు కావాల్సిన దేవుళ్ల విగ్రహాలను తయారు చేయడంతో పాటు రేగు గింజ సైజులో వివిధ రూపాలను చెక్కుతూ ప్రతిభను చూపుతున్నారు. బాల్యం నుంచి చిత్రకళపై ఆసక్తిని పెంచుకొని గ్రామంలోనే నిత్య సాధనతో ప్రావీణ్యం పొందుతున్నారు.



ఆయన చెక్కిన రూపాలు

★ తాను ఊహించుకున్న రూపాన్ని చేతులతో వస్తువులుగా తీర్చిదిద్దుకున్నారు. ఇత్తడి, రాగి విగ్రహాలతోపాటు శిల్పాలు, ఆలయ ధ్వజ స్తంభాలు, శిఖర కలశాలు, ముఖ తోరణాలు, విగ్రహ కవచాలు, కిరీటాలు, రాగి యంత్రాలు, దర్గాలకు, మొహర్రానికి సంబంధించి ఆభరణాలు తదితర వస్తువులను ఆయన సులువుగా తయారు చేయడంలో దిట్ట. ఈయన చేసినవి పలు విగ్రహాలు రాష్ట్రంలోని ఆయా దేవాలయాల్లో కనిపిస్తాయి.

ప్రత్యేకతలు..

★ ఏపీలోని ప్రముఖ క్షేత్రమైన విజయవాడ కనకదుర్గ ఆలయానికి కిలో వెండితో నవరత్న కిరీటం. ప్రకాశం జిల్లాలోని భైరవకొన త్రిముఖ దుర్గ ఆలయానికి విగ్రహం. చింతపల్లిలోని శిర్డీ సాయిబాబా దేవాలయానికి కిరీటం. రంగారెడ్డి జిల్లా కందుకూరులో మేరిమాతకు వెండి కిరీటం, వెంకటేశ్వరనగర్‌లోని పలు దేవాలయాలకు శివ కవచం ప్రత్యేకంగా తయారు చేసి అందించారు. రేగు గింజ సైజులో ఉన్న వాటిపై ఓ వైపు గణపతి, మరోవైపు లక్ష్మీదేవి విగ్రహాలను చెక్కి పలు దేవాలయాల్లోని విగ్రహాలకు జీవం పోశారు.

- న్యూస్‌టుడే, చింతపల్లి



మిలమిల మెరిసిన తారు

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిలో కోదాడ పట్టణంలోని దుర్గాపురం స్టేజీ వద్ద ఏర్పాటైన ఖమ్మం వెళ్లే నూతన రహదారి ఇలా వెలిగిపోతూ కనిపించింది.

- న్యూస్‌టుడే, కోదాడ

ఇక ఆరోగ్య యోగం

నకిరేకల్, న్యూస్‌టుడే: ఉరుకులు.. పరుగుల దైనందిన జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రాధాన్యం పెరుగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఉపయోగపడే యోగాను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు కొలిక్కివచ్చాయి. ఆయుష్ కేంద్రాలకు అనుబంధంగా గతేడాది జిల్లాలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్లు (ఆరోగ్య స్వస్థత యోగా మందిర్‌లు) తాజాగా సేవలు ప్రారంభించేందుకు కసరత్తు మొదలైంది. వీటిల్లో యోగా శిక్షకుల నియామకానికి ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నెలాఖరుకు నియామకాల ప్రక్రియను పూర్తిచేసే యోచనలో అధికారులున్నారు.



నకిరేకల్‌లో ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో ఏడాదిన్నర క్రితం నిర్మించిన ఆయుష్ యోగా మందిర్

మందిర్‌లు ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఆయుష్ వైద్య కేంద్రాల్లో ప్రభుత్వం 47 వెల్‌నెస్ సెంటర్ల భవనాలు నిర్మించింది. వీటికి జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రూ.2.70 కోట్లను వ్యయం చేసింది. ఈ నిధులతో యోగా కేంద్రాల నిర్మాణం చేపట్టారు. గాలి, వెలుతురు వచ్చే విధంగా వీటి నిర్మాణాలున్నాయి.

శిక్షణా తరగతులు...

ఆయుష్ యోగా మందిరాల్లో ఇద్దరు శిక్షకులను ఒక పురుషుడు, మహిళను నియమిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 47 యోగా మందిర్‌లకు 97 మంది శిక్షకులను నియమించనున్నారు. యోగా ధ్రువపత్రాలున్న పురుషునికి నెలకు రూ.8 వేలు, మహిళకు రూ.5 వేల గౌరవ వేతనంతో ఒప్పంద ప్రతిపాదికన శిక్షకులుగా నియమిస్తున్నారు. ఎంపికైన శిక్షకులు(పురుషులు) ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, మహిళలు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. యోగా కేంద్రాలకు వచ్చే స్థానికులకు ఉచితంగా యోగాసనాలు నేర్పించాలి. ఆయుష్ వైద్యులు ప్రజలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

ఉమ్మడి జిల్లాలో మందిరాలు ఇలా..

★ నల్గొండ: 21 మందిరాలు: శిక్షకుల సంఖ్య: 42

★ సూర్యాపేట: 12 మందిరాలు: శిక్షకుల సంఖ్య 24

★ యాదాద్రి : 14 మందిరాలు: శిక్షకుల సంఖ్య: 28

27న ఇంటర్వ్యూలు..

యోగా శిక్షకుల నియామకాల కోసం ఈ నెల 27న నల్గొండలోని ఆయుష్ వైద్యశాల ఆధ్వర్యంలో వాక్- ఇన్- ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాకు చెందిన వారు నల్గొండలోనే ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుంది. ఇంటర్‌పూర్తిచేసి, యోగా ధ్రువపత్రాలు కలిగిన వాళ్లు అర్హులని ఆయుష్ జిల్లా సీనియర్ వైద్యాధికారి డా.నర్సింహరావు తెలిపారు.

ఇరువర్గాలకు చెందిన ఎనిమిది మందికి రిమాండ్

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో కత్తులతో ఓ వర్గం వారు దాడి చేయగా.. మరో వర్గం ప్రతిదాడి చేసిన ఘటనలో మొత్తం ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్, భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఫర్హాన్, మహ్మద్ షారుఖ్, మహ్మద్ ఖాజా, మినాజ్, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన అమీర్‌లు కలిసి చౌటుప్పల్ పురపాలిక పరిధిలోని తంగడపల్లికి చెందిన షేక్ నుమాన్‌ని కలవడానికి వచ్చారు. అందరూ కలిసి మద్యం తాగారు. తాగిన మైకంలో కారును దురుసుగా నడుపుతుండటంతో ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నించినందుకు కత్తులతో పొడిచి దాడి చేశారని సుర్కంటి సుధాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో కుమారుడు బాలకృష్ణారెడ్డితో పాటు కౌన్సిలర్ హిమబిందు భర్త దండ అరుణ్‌కుమార్, సుర్వి మహేందర్‌లు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. కాగా.. కారును వేగంగా నడుపుతున్నారని తమని దుర్భాషలాడుతూ దండ అరుణ్‌కుమార్, సుర్కంటి బాలకృష్ణారెడ్డి, సుర్వి మహేందర్‌తో పాటు మరికొంత మంది తమపై దాడి చేశారని తంగడపల్లికి చెందిన నుమాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించి చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కత్తులతో దాడి చేసిన ఘటనలో.. షేక్ నుమాన్, మహ్మద్ షారుఖ్, మహ్మద్ ఖాజా, మహ్మద్ మినాజ్‌లను.. దురుసుగా డ్రైవింగ్ చేశారని కారులోని వ్యక్తులను చితకబాదినందుకు చౌటుప్పల్‌కు చెందిన మలిగె నవీన్, మలిగె సంతోష్, మలిగె రవి, మలిగె మహేశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు.

దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన డీసీపీ

చౌటుప్పల్‌లో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడి ఘటన నేపథ్యంలో డీసీపీ రాజేశ్‌చంద్ర పరిశీలించారు. మంగళవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ సందర్శించారు. ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్, ఎస్సైలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలకు ఆటంకం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

కుల నిర్మూలనకు పోరాడుదాం

నీలగిరి, న్యూస్‌టుడే: మహాత్మ జ్యోతిబా పులే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో స్థానిక పెద్దగడియారం చౌరస్తాలోని పులే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సత్యశోధక్ సమాజ్ నిర్వహించిన కార్యక్రమాలను కొనసాగిస్తూ కులనిర్మూలనకు పాటుపడుదామని పార్టీ నాయకుడు ఇందూరు సాగర్ చెప్పారు. కార్యక్రమంలో ఎఐఎఫ్‌టీయూ నాయకులు బొమ్మిడి నగేశ్, చారి, పవన్, వీరేశ్, లింగస్వామి, దశరథ, సురేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారి పరిశీలన

కట్టంగూరు: కట్టంగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి పి.శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తీరు, ఓపీ రోగుల సంఖ్యను మండల వైద్యాధికారి శ్వేతను అడిగారు.

గట్టుప్పల, న్యూస్‌టుడే:

? గట్టుప్పలలో వీధికుక్కలు విపరీతంగా పెరిగాయి. చిన్న పిల్లలను, పెద్దలను వెంబడిస్తూ కరుస్తున్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలి. - అభ్యాన్, గట్టుప్పల

✔ జిల్లా పశువైద్యశాఖ అధికారులతో మాట్లాడి వీధి కుక్కల నియంత్రణపై చర్యలు తీసుకుంటాం. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. - మాధవరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని శాంతినగర్‌లో వీధి కుక్కలు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నారులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. నివారణ చర్యలు తీసుకోవాలి. - నజీముద్దీన్, నల్గొండ.

✔ కుక్కల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక

పంపిణీకి నోచుకోని బుట్టలు!



నకిరేకల్: పుర కార్యాలయం ఆటకపై తడి, పొడి చెత్త బుట్టలు

నకిరేకల్, న్యూస్‌టుడే: 'స్వచ్ఛదనం- పచ్చదనం', స్వచ్ఛతా హీ సేవా ఉత్సవాలు.. ఇలా పలు కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పారిశుద్ధ్యం పట్టింపు లేకుండా పోతోంది. నకిరేకల్ పుర పరిధిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎరువుగా మార్చేందుకు నాలుగేళ్ల క్రితం కంపోస్టు షెడ్డును నిర్మించారు. నేటి వరకు ఒక్కసారి కూడా ఇది పని చేయలేదు. షెడ్డును ఆకతాయిలు ధ్వంసం చేస్తున్నారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించి ఇంటింటికీ రెండు బుట్టలు పంపిణీ చేయాలని గతంలో నిర్ణయించారు. దీని కోసం మొదటి విడతగా రూ.లక్షల వ్యయంతో రెండు వేల వరకు ప్లాస్టిక్ బుట్టలు తెప్పించారు. వీటిని ఇంటింటికీ పంపిణీ చేయకపోవడంతో పుర కార్యాలయంలోనే నాలుగేళ్ల నుంచి మూలుగుతున్నాయి. పారిశుద్ధ్య కార్యక్రమానికి ఉపయోగపడకుండా ప్రజా ధనాన్ని వృథా చేశారన్న విమర్శలున్నాయి. బుట్టలు పంపిణీ చేయకపోవడంతో నకిరేకల్ పుర పరిధిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం లేదు. అంతా కలిపి సేకరిస్తున్న చెత్తను కంపోస్టు షెడ్డు చుట్టూ గుట్టలుగా పోస్తున్నారు. నకిరేకల్‌లోని 20 వార్డుల పరిధిలో రోజుకు 15 టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. అక్టోబరు 2 వరకు నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా ఉత్సవాల్లో తడి, పొడి చెత్తకు అధిక ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వ మార్గదర్శకాలున్నాయి. ఈ దిశగా పుర అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం :

- డి.బాలయ్య, కమిషనర్, పురపాలిక, నకిరేకల్

తడి, పొడి చెత్త సేకరణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. గతంలో తెప్పించిన ప్లాస్టిక్ బుట్టలు అన్ని ఇళ్లకు సరిపడా లేనందున గత అధికారులు వాటిని పంపిణీ చేయలేదు. వీటి పంపిణీపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.



నిరుపయోగంగా కంపోస్టు షెడ్డు



చిట్యాల బస్‌స్టేషన్ కూడలిలో చెట్లకొమ్మల చెత్తకుప్పలు

రహదారిపై చెత్తకుప్పలు.. తొలగించకుండా నిర్లక్ష్యం

చిట్యాల, న్యూస్‌టుడే: హైదరాబాద్- విజయవాడ జాతీయరహదారికి, సర్వీసురోడ్డుకు మధ్య పెంచిన కోనోకార్పస్ చెట్లను జాతీయరహదారిపై చిట్యాల, చౌటుప్పల్‌లో చేపట్టనున్నపై వంతెన నిర్మాణంలో భాగంగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తొలగించారు. కొమ్మల చెత్తను ప్రధాన రహదారి వెంట దిబ్బలుగా ఆలాగే వదిలేశారు. వీటిని అక్కడి నుంచి తొలగించడంలో అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనాలు వెళ్లాల్సిన మార్జిన్‌లోనూ ఈ చెట్లకొమ్మల చెత్తను వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బస్‌స్టేషన్ కూడలిలో భవాని హోటల్ వైపు నుంచి బస్‌స్టేషన్ వైపు వెళ్లేదారి ప్రధాన రహదారిపైకి అవసరవైదిశలో వెళ్లాల్సిన పరిస్థితి. ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనాలకోసం కేటాయించిన మార్జిన్ పరిధిలో కొట్టిన చెట్ల కొమ్మలు, చెత్త వదిలేయడంతో ప్రధాన రహదారిపై అపసవ్య దిశలో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. వదిలేసిన కొమ్మలు, ఆకులు ఎండి పోయాయి. ఎవరైనా అనుకోకుండా సిగరెట్, అగ్గిపుల్లను ఈ చెత్తపైకి విసిరేసినా అగ్నిప్రమాదం చోటుచేసుకునే పరిస్థితి ఉంది. కొట్టిన చెట్లకొమ్మల చెత్తను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలో చర్యలు తీసుకుంటాం

- నాగేశ్వరరావు, పీడీ, ఎన్‌హెచ్ఏఐ

జాతీయరహదారిపై చిట్యాలలో పైవంతెన నిర్మాణానికి సంబంధించి ప్రధాన రహదారి, సర్వీసురోడ్డుకి మధ్య పెంచిన చెట్లను తొలగించాం. మొద్దులు ఇక్కడి నుంచి తరలించాం. మిగిలినచెట్ల కొమ్మలను కూడా తొలగించి, ప్రజలకు అసౌకర్యం లేకుండా చూస్తాం.

ఆలయ శిఖరంపై చెట్ల తొలగింపు

స్పందనకు వందనం

నీలగిరి: స్థానిక రామగిరిలోని సీతారామచంద్రస్వామి దేవాలయం గోపురంపైన గోడలపైన వేంకటేశ్వరస్వామి ఆలయం శిఖరంపైన పెరుగుతున్న చెట్లను తొలగించాలని అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా వదిలేశారు. దీనిపై 'నిర్లక్ష్యం పెరిగి చెట్లుగా ఎదిగి' శీర్షికతో మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆలయ అధికారులు స్పందించి చెట్లు తొలగించారు. దేవాలయాలపై చెట్లు పెరగకుండా శాశ్వత పరిష్కారం చేయాలని ఆలయం ఈవో జయరామయ్య తెలిపారు.

పారిశుద్ధ్యం పడక..



జనరల్ ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలోని అన్ని వార్డుల్లో గుత్తేదారులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పారిశుద్ధ్యం పడకేసింది. ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మెబాట పట్టారు. నిరవధిక సమ్మె కారణంగా అన్ని వార్డుల్లో చెత్త, మురుగు, నీటి సరఫరా నిలిచి పోయింది. మాతాశిశు సంరక్షణ కేంద్రంలో ప్రసవానికి వచ్చిన మహిళలతో పాటు ఇతర చికిత్సలు పొందుతున్న రోగులు నరక యాతన పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది.. మున్సిపల్ సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు సర్దిచెప్పారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ గుత్తేదారుతో మాట్లాడి వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది తిరిగి విధుల్లోకి చేరారు. గుత్తేదారుతో పాటు వైద్య సిబ్బందిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడారు. పుర పాలికలో పనిచేస్తున్న 50 మందికి పైగా సిబ్బందిని పంపించి కొంత వరకు మెరుగు పరిచారు. ఈ సమయంలో ధర్నా చేస్తున్న

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

మునుగోడు, న్యూస్‌టుడే: మునుగోడు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కొరటికల్



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొరటికల్ గ్రామస్థులు

గ్రామస్థులు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కొరటికల్ నుంచి కిష్టాపురం వరకు రూ.3.45 కోట్లు, దుబ్బాకాల్వ మీదుగా కొరటికల్‌కు రూ.50 లక్షలు, దుబ్బకాల్వ, పోలిపురం గ్రామ వాగులపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మండల బీసీసెల్, లింగస్వామి, యాదయ్య, పాపయ్య, సైదులు, వెంకన్న, స్వామి, యాదగిరి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: సీఐ

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలిస్ కార్యాలయంలో జటిలమైన మాదక ద్రవ్యాలు తీసుకుని బానిసలైన యువకుల వారి కుటుంబ సభ్యులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డా.అనిల్, ఏఆర్ ఎస్సై కాంతారావు, పోలీస్ కళా బృందం పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో కాషాయ జెండా ఎగురవేస్తాం: భాజపా



మర్రిగూడలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి తుళ్ల వీరేందర్ గౌడ్

మర్రిగూడ, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేసి సత్తా చాటుతామని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి తుళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మర్రిగూడలో మండలాధ్యక్షుడు పాతులోతు రాజేందర్‌నాయక్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి బూత్‌లో 200 మందికి పార్టీలో సభ్యత్వం కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. రమేశ్, పెద్దులు, అశోక్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, లింగం, రాజు, గణేశ్ ఉన్నారు.

నాంపల్లి: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం మండలంలో నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తుళ్ల వీరేందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింహ, అమరేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ, పిట్టల శ్రీను, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నీలగిరి: స్థానిక 41వ వార్డులో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ సభ్యత్వం చేర్పించారు. వార్డులో అత్యధిక సభ్యులను చేర్పించడానికి కృషి చేస్తున్నామని వార్డు ఇన్‌ఛార్జి ఎల్లిర్ల మణి మదిరాజు తెలిపారు. నాయకులు కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, వెంకన్న, సత్యదేవ్, అరుణ, రమేశ్ పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. ఆటోడ్రైవర్‌కు ఐదేళ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ఒంటరిగా వెళ్తున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి న్యాయస్థానం ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.12,500 జరిమానా విధించింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత బల్ద కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం నాంపల్లి గ్రామానికి చెందిన భీమనపల్లి రాజు(23) పెద్ద అంబర్‌పేటలో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2018 మే 8న కొత్తగూడెం ఆటో స్టాండ్ సమీపం నుంచి ఓ బాలిక(13) ఒంటరిగా వెళ్తుండగా.. ఆమెను బలవంతంగా పాత భవనంలోకి లాక్కెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలతో స్థానికులు రావడంతో పారిపోయాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి, కోర్టులో అభియోగపత్రం దాఖలుచేశారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి మంగళవారం తుదితీర్పు వెల్లడించారు. బాధిత బాలికకు రూ.2 లక్షల పరిహారం ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిని న్యాయమూర్తి ఆదేశించారు.

గుర్రంపోడు ఎంపీడీవో తొలగింపు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్యక్రమాలు, కంపోస్టు షెడ్ల నిర్మాణం, మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గుర్రంపోడు ఎంపీడీవో పి.మంజులను కలెక్టర్ సస్పెండ్ చేశారు. గడ్డికల యంత్రాలను కొనుగోలు చేయాలని ఆదేశించినప్పటికీ కేవలం 10 గ్రామపంచాయతీల్లో మాత్రమే కొనుగోలు చేశారని పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలతో దూరదృశ్య శ్రవణం ద్వారా సమీక్షించారు. పెద్దపూర మండలం పులిచర్ల గ్రామ కొబ్బరిపోర్టింగ్ గ్రామపంచాయతీ కార్యదర్శి కె.నాగరాజు అనధికారికంగా విధులకు గైర్హాజరుకావడం, అందుబాటులో లేకపోవడం, చెత్త సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆయనను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. దామరచర్ల మండలం వాచ్యతండా జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శి కె.సప్న పారిశుద్ధ్యం, మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ఆధునిక పద్ధతులతో రైతులకు లాభం

కేశపల్లి,న్యూస్‌టుడే: ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేస్తే ఖర్చులు తగ్గి, అధిక దిగుబడులు వస్తాయని భారతీయ వరి పరిశోధన శాస్త్రవేత్త బి.వెంకయ్య చెప్పారు. బొప్పారం గ్రామంలో మంగళవారం పైరును నేరుగా విత్తే వరిసాగు- యాజమాన్య పద్ధతులపై ఐసీఏఆర్ ఆధ్వర్యంలో ఎస్‌టీబీఏ సీఐఆర్ సహకారంతో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు నేరుగా వరివిత్తే పద్ధతి, డ్రోన్ సహాయంతో క్రిమిసంహారక మందులు పిచికారి చేయడం, సస్య రక్షణ చర్యలు పాటించాల్సిన తదితర అంశాలను వివరించారు. ఏవో బి.పురుషోత్తం, ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, నాగరాజు, అజయ్, సుదాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బొప్పారంలో వెదజల్లే పద్ధతిలో సాగుచేసిన వరిని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అధికారుల విచారణ

మునుగోడు, న్యూస్‌టుడే: మునుగోడు పంచాయతీ పరిధి ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలు, వంచాయతీలో అనుమతులు పొందిన తదితర అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని అదనపు కలెక్టర్ పూర్ణచందర్ ఐటీడీఏ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జేసీసీ అధికారుల బృందం మంగళవారం సర్వే నంబరు 10లో విచారణ చేపట్టారు. ఎంత మంది ఆక్రమించారనే వివరాలను సేకరించారు. డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు, తహసీల్దారు నరేందర్, ఎంపీడీవో పూజ, ఎంపీవో స్వరూప, ఆర్‌వీ నాగరాజు, ఉన్నారు.



విచారణ చేపడుతున్న జేసీసీ బృందం

చర్యలు తీసుకోవాలని డిమాండ్

చిట్యాల, న్యూస్‌టుడే: పట్టిమర్రిలో కృష్ణాపిటి సరఫరా కోసం నిర్మించిన నీటిట్యాంకును అకారణంగా, అక్రమంగా కూల్చివేయాలని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. పట్టిమర్రికి వెళ్లి కూల్చివేతకు గురైన ట్యాంకును పరిశీలించారు. బూరుగు విజయకుమార్, బూరుగు శ్రీను, నర్రా వీర్లారెడ్డి, వెంకన్న, భాస్కర్, గోపి, ఆయన వెంట ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నల్గొండ గ్రామీణం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అటవీశాఖ యాదాద్రి సర్కిల్ సీసీఎఫ్ శివాని డోగ్రా అన్నారు. మంగళవారం మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన యాదాద్రి అటవీశాఖ సర్కిల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులకు ఇలాంటి క్రీడాపోటీలు మానసిక ప్రశాంతతకు దోహదపడతాయన్నారు. డీఎఫ్‌వో రాజశేఖర్ మాట్లాడారు.

బాధ్యతల స్వీకరణ

కనగల్: కనగల్ మండల ప్రత్యేక అధికారిగా చీఫ్ ప్లానింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి సదానందం విరాకాదాబాద్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వెంకటేశ్వర్లును నియమించారు.

మిషన్ భగీరథ సమస్యల పరిష్కారానికి కృషి



నల్గొండ: మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం గ్రామపంచాయతీల్లోని మల్టీపర్పస్ సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మంగళవారం నల్గొండ ఎంపీడీవో కార్యాలయంలో నల్గొండ, తిప్పర్తి మండలాలకు సంబంధించిన మల్టీపర్పస్ సిబ్బందికి నీటి సరఫరాపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శంకర్‌కుమారి, డీఈఈ సంపత్, ఏఈలు షమీముద్దీన్, గంగాభవాని, అజిత, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో సమస్యలను సత్వరం పరిష్కరించే విధంగా గ్రామ తాగునీటి సహాయకులు సన్నద్ధంగా ఉండాలని గ్రామీణ నీటి సరఫరా మిషన్ భగీరథ గ్రిడ్ నల్గొండ ఈఈ వంశీకృష్ణ కోరారు. నకిరేకల్ మండల పరిషత్‌లో సబ్ డివిజన్ స్థాయి గ్రామ తాగునీటి సహాయకుల శిక్షణ తరగతుల్లో మంగళవారం మాట్లాడారు. పంపుసెట్లకు విద్యుత్ సరఫరా, విడిభాగాలు, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులపై సహాయకులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎ.నర్సింహా, మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, గ్రిడ్ డీఈ రాజకుమార్, ఏఈలు ఎం.మాధవి, అశోక్, జె.నవీన్, రాంబాబు, మాస్టర్ ట్రైనర్ నజీమోద్దీన్ పాల్గొన్నారు.

మునుగోడు, న్యూస్‌టుడే: నీటి సరఫరాపై గ్రామ పంచాయతీ సిబ్బందికి అవగాహన ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు సూచించారు. మునుగోడు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ మంచి నీటి సేవకులకు నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. డీఈఈలు వెంకటేశ్వర్లు, డీఈఈ ముజీబుద్దీన్, ఎంపీడీవో పూజ, ఎంపీవో స్వరూపరాణి, ఏఈఈ మణిదీప్, రామచంద్రయ్య ఉన్నారు.

జమిలి ఎన్నికలు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం

చండూరు, న్యూస్‌టుడే: జమిలి ఎన్నికల విధానానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. చండూరులో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటికి హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. ధనంజయగౌడ్, లింగయ్య, వెంకటేశం, నర్సింహ, స్వామి, వెంకన్న పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న ప్రభావతి

కనగల్,న్యూస్‌టుడే: మహిళలపై జరుగుతున్న దాడులపై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చి అమలు చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా కుతాడి రాములమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ సుల్తానా, ఉపాధ్యక్షురాలుగా సుజాతను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకురాలు పద్మ, యశోద, లక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని డిమాండ్

నకిరేకల్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాళ ప్రమీల డిమాండ్ చేశారు. నకిరేకల్ పన్నాలగూడెంలో సీపీఎం 6వ, 7వ శాఖల మహాసభల్లో మంగళవారం మాట్లాడారు. పింఛన్ల మొత్తాలను పెంచి కొత్తవి మంజూరు చేయాలని, రేషన్‌కార్డులు జారీచేయాలని, పేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలన్నారు. శాఖల కార్యదర్శులుగా చెన్నబోయిన నాగమణి, సరికొండ శివాని ఎన్నికయ్యారని ప్రకటించారు. మాజీ ఎంపీపీ సుంకి మణెమ్మ, వంటిపాక వెంకటేశ్వర్లు, బి.ఇందిర పాల్గొన్నారు.

అవీ ఇవీ

ఎన్ఎస్ఎస్ దినోత్సవం.. నకిరేకల్: జాతీయ సేవా దినోత్సవాన్ని నకిరేకల్‌లోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మంగళవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటి కార్యక్రమాలను ప్రిన్సిపాళ్లు డా.బెల్లి యాదయ్య, చామల మల్లారెడ్డి ప్రారంభించారు. గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు.

గోడపత్రికలు ఆవిష్కరణ.. నకిరేకల్: ఈ నెల 25 నుంచి అక్టోబరు 24న నిర్వహించే పీడీఎస్‌యూ ఆల్ ఇండియా శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రవి ఓ ప్రకటనలో కోరారు. నకిరేకల్‌లో ఉత్సవాల ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. చిరంజీవి, అనిల్, హేమంత్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉద్యోగాలు.. నల్గొండ టౌన్: విద్యార్థులు కష్టపడి చదివితే ఉద్యోగాలను సాధించవచ్చని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచంద్ర కిశోర్ అన్నారు. కాకతీయ డిగ్రీ కళాశాలలో కంపెనీ సెక్రటరీ (సీఎస్) కోర్సుపై నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. ప్రిన్సిపల్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి.. నార్కట్‌పల్లి గ్రామీణం: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ ఇస్మాయిల్ కోరారు. ఆ కళాశాలలో జాతీయ ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి ప్రవీణ్ సింగ్, అసరా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ, అధ్యాపకులు వెంకటేశ్, శంకరయ్య, సుల్తానా, యామిని, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హోంగార్డు మృతి.. తిప్పర్తి: తిప్పర్తికి చెందిన కొప్పెర జనార్దన్(45) నాగ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందారు. జనార్దన్ కేతేపల్లి పీఎస్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నారు.

పోషణ్ అభియాన్.. నాంపల్లి: పెద్దాపురంలోని కేజీబీవీ, జడ్పీ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపీడీవో సత్యకుమార్, ఎంపీవో ఝాన్సీ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం.. నకిరేకల్: కడపర్తిలో ఎం.గోవిందమ్మ(55) అనారోగ్యంతో మృతిచెందడం పట్ల ఎమ్మెల్యే వేముల వీరేశం సంతాపం తెలిపారు. రూ.10వేల సాయాన్ని పాటి యాదగిరిరెడ్డి అందజేశారు.

చండూరు: పుల్లెంల గ్రామానికి చెందిన పోలే రమాశంకర్ ఐటీఐ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆతనికి భార్య ఆయిదేళ్లలోపు పాప ఉన్నారు. గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు, యువకులు రమాశంకర్ కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి.. మృతుడి చిన్నారి పేరున నిమిత్తం సుకన్య సమృద్ధి యోజన ఖాతాను ప్రారంభించి రూ.35 వేల నగదును జమ చేశారు. ఇరిగి శివ, ఉదయ్, సత్యనారాయణ, హరీశ్, రాజీవ్, చింతయ్య పాల్గొన్నారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ:	పీవీఆర్: రిజర్వ్డ్
నటరాజ్:	బొమ్మరిల్లు, వెంకటేశ్వర: మత్తు వదలరా 2
నకిరేకల్:	రామకృష్ణ: హైపర్-సేక్, వెంకటేశ్వర: మత్తు వదలరా 2

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి: జూలకంటి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించి.. ప్రస్తుతం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న సీజనల్ వ్యాధులు, విషజ్వరాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మిర్యాలగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు చట్టాలతో కార్మికులకు అనేక ఇబ్బందులయ్యే ప్రమాదం ఉన్నందున తక్షణమే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిర్మాణం జరిగి శిథిలావస్థకు చేరుతున్న రెండు పడక గదుల ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. మల్లేష్, గౌతంరెడ్డి, రవినాయక్, మంగారెడ్డి, వరలక్ష్మి పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

చింతపల్లి: మండల కేంద్రంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. రమేష్, శేఖర్, జహంగీర్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

న్యూస్‌టుడే, కొండమల్లేపల్లి, చింతపల్లి

? స్థానిక బీసీ కాలనీ పాత ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సమీపంలోని భూగర్భ మురుగు కాల్వ నిండి మురుగు వీధులలో ప్రవహిస్తోంది. దుర్వాసన భరించలేకపోతున్నాం.
– పందుల కోటయ్య, స్థానికుడు

✔ వెంటనే సిబ్బందిని పంపి కాల్వను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తాం. – ఢాకునాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి

? మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెనుక భాగంలో గోడ పక్కల పశువులను కట్టేస్తుండటంతో దోమలు పెరిగి జ్వరాలు వస్తున్నాయి. - పి.యాదగిరి, చింతపల్లి.

✔ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రదీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, చింతపల్లి.

నాణ్యమైన భోజనమందించండి

హాలియా, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన భోజనమందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి అన్నారు. మంగళవారం ఆయన




వంటగదిని పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి

హాలియా కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఎంఈవో బాలునాయక్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సబ్‌కలెక్టర్‌కు వినతి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: దళితులకు ఎస్సీ సబ్ ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని దళితులపై అన్యాయాలను అరికట్టాలని దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ నాయకుడు వల్లంపట్ల వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇప్పించి గృహ నిర్మాణాలు జరిపించాలని కోరారు. జిల్లా కార్యదర్శి లింగానాయక్, సుందర్, అన్వర్, రహీం, శ్యామ్ పాల్గొన్నారు.

రూ.170 కోట్ల ప్రాజెక్టు.. పదిహేనేళ్లుగా సా..గుతోంది..!



మిర్యాలగూడ పట్టణంలో నిర్మాణంలో ఉన్న భూగర్భ మురుగునీటి ప్రాజెక్టు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ పట్టణంలో పదిహేనేళ్ల క్రితం ప్రారంభమైన భూగర్భ మురుగునీటి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు గాను అమృత్ నిధులు రూ.170 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిగా జైపాల్‌రెడ్డి పనిచేసిన సమయంలో మిర్యాలగూడ పట్టణానికి భూగర్భ మురుగునీటి ప్రాజెక్టును రూ.54 కోట్లతో నిర్మించేందుకు నిధులు కేటాయించారు. పట్టణంలోని అన్ని వీధుల్లో భూగర్భ పైపులైన్లు, రెండు వ్యర్థపునీటి శుద్ధి ప్లాంటులు నిర్మించాల్సి ఉంది. పట్టణంలోని తాళ్లగడ్డలో స్థల సమస్యతో నిర్మాణ పనులు ఆలస్యం కాగా పెరిగిన ధరలతో గుత్తేదారు పనులను అసంపూర్తిగా నిలిపివేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత రూ.60 కోట్లు కేటాయించారు. ఈ పనులు ప్రారంభించగా మ్యాన్‌హోల్ మరమ్మతులు చేస్తున్న సమయంలో విషవాయువులు వెలువడి ఇద్దరు మృతిచెందారు. దీంతో నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిపివేశారు.

★ తాజాగా అమృత్ నిధులు రూ.170 కోట్లు కేటాయించగా గతంలో వేసిన పైపులైన్లు, మ్యాన్‌హోల్‌లకు మరమ్మతులు చేసి నూతన కాలనీల్లో పైపులు వేయటం, వ్యర్థపునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించారు. తాళ్లగడ్డలో వ్యర్థపునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణానికి స్థల సమస్య ఉండటంతో రెవెన్యూ అధికారులకు హద్దులు నిర్ణయించేందుకు లేఖలు రాశామని వారు గుర్తించిన వెంటనే నిర్మాణాలు పూర్తి చేస్తామని డీఈ వెంకన్న తెలిపారు.



గతంలో వేసిన మ్యాన్‌హోల్‌లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గుర్రంపోడు ఎంపీడీవో తొలగింపు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్యక్రమాలు, కంపోస్టు షెడ్ల నిర్మాణం, మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గుర్రంపోడు ఎంపీడీవో పి.మంజులను కలెక్టర్ సస్పెండ్ చేశారు. గడ్డికోత యంత్రాలను కొనుగోలు చేయాలని ఆదేశించినప్పటికీ కేవలం 10 గ్రామపంచాయతీల్లో మాత్రమే కొనుగోలు చేశారని పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలతో దూరదృశ్య శ్రవణం ద్వారా సమీక్షించారు. పెద్దవూర మండలం పులిచర్ల గ్రామ ఔట్‌సోర్సింగ్ గ్రామపంచాయతీ కార్యదర్శి కె.నాగరాజు అనధికారికంగా విధులకు గైర్హాజరుకావడం, అందుబాటులో లేకపోవడం, చెత్త సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆయనను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. దామరచర్ల మండలం వాచ్యతండా జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శి కె.స్వప్న పారిశుద్ధ్యం, మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలోనే నంబరు 1 పురపాలికగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ పురపాలికను తెలంగాణలోనే నంబరు 1గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పురపాలిక ఉద్యోగులు, సిబ్బందికి మంగళవారం స్థానికంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 2న పట్టణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ మాట్లాడుతూ పురపాలిక పరిధిలో తెలియజేసిన సమస్యలను తాము పరిగణలోకి తీసుకున్నామని వాటిని పరిష్కరిస్తామన్నారు. తహసీల్దారు హరిబాబు, కమిషనర్ యూసుఫ్, డీఈ వెంకన్న పాల్గొన్నారు.

★ మిర్యాలగూడ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని ఆర్య వైశ్యులకు కేటాయించాలని కోరుతూ పలువురు రైస్‌మిల్లర్లు, ఆర్య వైశ్య కుల సంఘాల సభ్యులు మంగళవారం మిర్యాలగూడలో ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను కోరారు. మార్కెట్ కమిటీ జనరల్‌కు రిజర్వ్ అయినందున పట్టణానికి చెందిన రైస్ మిల్లర్ మాశెట్టి శ్రీనివాస్‌కు కేటాయించాలని కోరారు.

★ దేశంలోని రాష్ట్రాలు, రాజధానుల పేర్లను 15.8 సెకన్లలో చెప్పి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సాధించిన మిర్యాలగూడకు చెందిన చిన్నారి రాపర్తి మను శ్రీరామ్‌ను మంగళవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ అభినందించారు.

చదువుతో పాటు సమాజసేవ అవసరం

చింతపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఛైర్మన్, ప్రిన్సిపల్ ఉదయ్‌రాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని డాక్టర్ అలూకా జైహింద్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రమదానం నిర్వహించారు. వాసురాం, కిరణ్‌కుమార్, రామస్వామి, లింగస్వామి, ప్రభాకర్, అంజయ్య, లావణ్య, కాంతయ్య, సురేష్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

డిండి: విద్యార్థులకు చదువుతో పాటు సమాజసేవ అవసరమని కళాశాల ప్రిన్సిపల్ టి.గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం డిండిలోని డీఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవ పథకం దినోత్సవ సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించారు. కృష్ణయ్య, సంతోష్‌కుమార్, పాండురంగయ్య, ఆంజనేయులు, రెడ్యా, బాలరాజు, పుష్పరాణి, సురేష్, మణికంఠం పాల్గొన్నారు.



డిండి కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

మిర్యాలగూడ పట్టణం: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకోవడంతో పాటు సామాజిక సేవలో పాలు పంచుకోవాలని మిర్యాలగూడలోని కేవీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ భీమార్జున్‌రెడ్డి అన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రవీందర్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలవాటు చేసుకోవాలి.. నాగార్జునసాగర్: విద్యార్థి దశ నుంచి సేవా దృక్పథం అలవాటు చేసుకోవాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్‌రాజు అన్నారు. మంగళవారం సాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ అధికారి వెంకటయ్య, కేఎన్‌హెచ్ ఎయిడ్స్ లిటరసీ కోఆర్డినేటర్ మత్స్యానాయక్, అధ్యాపకులు ప్రసన్నలక్ష్మి, గోపాలకృష్ణ, సైదమ్మ, జనార్దన్, ఉపేంద్రచారి పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిలో వరి నాట్లు



ప్రభుత్వ భూమిలో వేసిన వరి నాట్లు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్న ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిని దున్ని వరినాట్లు సైతం వేశాడు గుర్తు తెలియని ఆక్రమణదారుడు. మిర్యాలగూడలోని చింతపల్లి బైపాస్ సమీపంలోని సర్వే సంఖ్య 626లో ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో కొంత భూమిని ఇతరులకు అసైన్ చేయగా.. మిగిలిన భూమిలో సుమారు 20 గుంటల్లో ఓ గుర్తు తెలియని వ్యక్తి రాత్రికి రాత్రే నాటు వేశాడు. మంగళవారం వరి నాట్లను పరిశీలించిన రెవెన్యూ అధికారులు.. ఆక్రమణదారుడు ఎవరో గుర్తించే పనిలో ఉన్నట్లు సమాచారం.

నియంత్రిక ఏర్పాటు

త్రిపురారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని విద్యుత్తు ఉప కేంద్రంలోని 8 ఎమ్‌వీఏ నియంత్రిక రెండు రోజుల క్రితం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ శబ్దం రావడంతో మరమ్మతులకు గురైంది. 12 టన్నుల బరువు ఉన్న నియంత్రికను తొలగించి దాని స్థానంలో కొత్తగా 8 ఎమ్‌వీఏ నియంత్రికను మంగళవారం ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన పవర్ నియంత్రిక విలువ రూ.1.15 కోట్లు ఉంటుందని విద్యుత్తు అధికారులు తెలిపారు. ఉదయం నుంచి ప్రారంభమైన పనులను ఏడీఈ రవీందర్‌రెడ్డి, మండల విద్యుత్తు అధికారి రవీందర్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు.

ఎన్నెస్పీ భూములు ఆక్రమిస్తే చర్యలు

నిడమనూరు, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జే.కృష్ణయ్య, ఎన్నెస్పీ ఈఈ మల్లిఖార్జున్ అన్నారు. నిడమనూరులో ఎన్నెస్పీ కాలువ వెంట కొన్ని చోట్ల ఆక్రమణకు గురైన ప్రాంతాల గుర్తించిన వారు మంగళవారం వాటిని పరిశీలించారు. ప్రభుత్వ భూములతో పాటు ఎన్నెస్పీ భూములు ఎక్కడ ఆక్రమణకు గురైన చర్యలు తీసుకుంటామని వారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని చాకలిశేరిపల్లి, చింతపల్లిలోని సాయిబాబానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్యలక్ష్మి, ప్రీ స్కూల్, పోషకాహార లోపంతో ఉన్న పిల్లలకు అందించే ఆహారం, పిల్లల బరువులు, ఆటపాటల విషయాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అరుణ, స్వరూప, వాసవి, సుగుణ, పార్వతి, అంజలి ఉన్నారు.

అప్రమత్తత అవసరం

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎస్‌వో రమావత్ దస్రు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాల్నేపల్లిలో పారిశుద్ధ్య పనులను, పీహెచ్‌సీ సబ్ సెంటర్‌ను పరిశీలించి మాట్లాడారు. స్థానికంగా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని, గ్రామంలోని వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఎంపీవో మోసిన్‌బిన్ అహ్మద్, టీఏ రాధ, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలున్నారు.



సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రంలో కంపోస్ట్ ఎరువును పరిశీలిస్తున్న ఎంఎస్‌వో దస్రు

జాతీయస్థాయికి ఎంపిక

త్రిపురారం, న్యూస్‌టుడే: మండలంలోని దుగ్గేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సంక్రాంతి సోనియా దిల్లీలోని ప్రగతి మైదానంలో మూడు రోజుల క్రితం నిర్వహించిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శనలో చక్కని ప్రతిభ కనబరిచింది. ఈ కారణంగా జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబు, ఉపాధ్యాయులు దశరథరాం, శ్రీలత, సోమయ్య, రాంరెడ్డి, ఎస్‌ఎ పీడీ కరుణకర్ రెడ్డి విద్యార్థిని సన్మానించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

దామరచర్ల, న్యూస్‌టుడే: నూనావత్‌తండా సబ్‌స్టేషన్‌లో 5ఎంవీఏ స్థానంలో 8ఎంవీఏ సామర్థ్యం గల పవర్ నియంత్రిక బిగిస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ రవీందర్‌రెడ్డి, ఏఈ అబ్దుల్లాహబీబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేశవాపురం, రాంకీఫీడర్ల పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ముల్కలపల్లిలో ఏఎస్పీ విచారణ

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ముల్కలపల్లికి చెందిన వివాహిత జాల రజిత అనుమానాస్పద మృతికేసులో విచారణాధికారి నల్గొండ ఏఎస్పీ రాములు నాయక్ విచారణ జరిపారు. మంగళవారం ఉదయం ఆయన తన సిబ్బందితో ముల్కలపల్లికి వచ్చి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అసలు ఘటనాస్థలంలో ఆ రోజున ఏం జరిగిందని, ఈ కేసులో ఇచ్చిన ఫిర్యాదుకు భిన్నంగా పోలీసులు వ్యవహరించారా.. అని ఒక్కొక్కరిని విడివిడిగా పిలిచి ప్రశ్నించారు. తమకేమీ తెలియదని, కొందరు బయటివ్యక్తులే వదంతులు పుట్టించారని, బాధిత కుటుంబసభ్యులు ఏఎస్పీ రాములు నాయక్‌కు వివరించినట్లు సమాచారం. పరిహారం కింద రూ.30 లక్షలు నిందితుడు ఇచ్చేలా చేసుకున్న ఒప్పందం, పోలీసులకు ఇచ్చినట్లుగా చెబుతున్న రూ.6లక్షల లంచం వ్యవహారమూ విచారించినట్లు తెలిసింది.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖాధికారి వీ.వీ.ఎస్.సాయిబాబా

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంబించి అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి వీ.వీ.ఎస్.సాయిబాబా అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతువేదికలో రైతులకు మంగళవారం నిర్వహించిన ఒకరోజు శిక్షణ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాయితీ వివరాలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పాం గెలల ధర రూ.14,392 ఉండగా.. దీనికి అదనంగా రూ.1,500 నుంచి రూ.1,700 వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం ఇతర అధికారులు సాగులో మెలకువలు, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్, డాక్టరు సుబ్బారావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భారాస నాయకుడికి మాజీ మంత్రి పరామర్శ

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, భారాస నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారిని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన తల్లి గోవిందమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి వెంట నారాయణరెడ్డి, చిట్టిబాబు, వీరకోటిరెడ్డి, బాలాజీనాయక్, హాతీరాం, బాబయ్య, శ్రీధర్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

అవీ ఇవీ

సమగ్ర విచారణ జరిపించాలి.. మిర్యాలగూడ పట్టణం: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉపయోగించిన ఉదంతంపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ధర్మ జాగరణ సమితి మిర్యాలగూడ సహ ప్రముఖ్ గుండా ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. సైదానాయక్, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకటకృష్ణ, శ్రీధర్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే.. గుర్రంపోడు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసమే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్)లో చేరుతున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరాములు అన్నారు. మంగళవారం ఆయన గుర్రంపోడు, కనగల్ మండలాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన గుర్రంపోడులో విలేకరులతో మాట్లాడారు. టీపీయూఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పాపిరెడ్డి, ప్రధానకార్యదర్శి భాస్కర్ గౌడ్, గుర్రంపోడు మండల అధ్యక్షుడు సైదయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి.. పెద్దవూర: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన ఘటన పెద్దవూర మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. పెద్దవూర పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న సెల్‌టవర్ దగ్గర నియంత్రికకు గేదె తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందిందని బాధితుడు మట్టపల్లి గురువారెడ్డి తెలిపారు. గేదె విలువ రూ.95వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి.. హాలియా: హాలియా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వసంత్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో నల్గొండలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. వసంత్‌కుమార్ హాలియా అంగడిబజారులో నివాసం ఉంటున్నారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. హాలియా ఎస్సై సతీష్‌రెడ్డి ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించారు.

సమయపాలన పాటించాలి.. త్రిపురారం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీటీసీవో కల్యాణ్ చక్రవర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వారంతా సమయపాలన పాటించాలని కోరారు. అనంతరం ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

క్రీడలు ప్రారంభం.. హాలియా: నేటి యువత మానసికంగా, శారీరకంగా ఎదగడానికి భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిగా తీసుకోవాలని హాలియా ఎస్సై సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హాలియాలో భగత్‌సింగ్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాగార్జునసాగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, శంకర్, మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, రమేష్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు.. డిండి: బస్సు నుంచి కిందకు దిగుతున్న క్రమంలో అదుపుతప్పి ఒకరికి గాయాలైన ఘటన డిండి బస్టాండ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణ పనినిమిత్తం దేవరకొండకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బస్టాండ్‌లో బస్సు దిగుతుండగా అదుపుతప్పి బస్సు టైరు కిందపడ్డాడు. ఈప్రమాదంలో అతని కాలుకు గాయాలయ్యాయి. అతడిని కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందలేదని ఎస్సై రాజు తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు.. దేవరకొండ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. సాయి, కిరణ్, అనిల్, వంశీ, పల్లె దినేష్, హరీష్, శంకర్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం.. దేవరకొండ: పురపాలిక పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పురపాలిక సంఘం ఛైర్మన్ నర్సింహ, పుర కమిషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దేవరకొండ పురపాలిక కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు, వివిధ విభాగాల సిబ్బందికి బొడ్డుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

సమాజ సహకారం అవసరం.. మిర్యాలగూడ గ్రామీణం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమాజ సహకారం అవసరమని మండల విద్యాధికారి ఎం.బాలాజీ నాయక్ అన్నారు. మండల పరిధిలోని రాయినిపాలెంలో విజయ్‌కుమార్ అందించిన ప్రాథమికోన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థులకు టై, షూ, బెల్ట్‌లను ఆయన మంగళవారం అందజేసి మాట్లాడారు. మరోవ్యక్తి వెంకటేశ్వర్లు రూ.4,500లతో సమకూర్చిన మైకు సెట్‌కు పాఠశాలకు ఇచ్చారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: కళింగ, **వెంకటేశ్వర:** సరిపోదా శనివారం, బొమ్మరిల్లు **విట్రోస్:** సరిపోదా శనివారం, గోట్, భలే ఉన్నాడే, మత్తు వదలరా-2, ఏ.ఆర్.ఎం, **శ్రీనివాస:** మత్తు వదలరా - 2